నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I హైదరాబాద్, ఆదివారం 23 మార్చి 2025 | VIKARABAD

# క్యాబ్‌ల్లో నో ఏసీ!

నో ఏసీ క్యాంపెయిన్‌కు తెలంగాణ క్యాబ్ డ్రైవర్లు పిలుపు

రేపటి నుంచి నగరవ్యాప్తంగా ఉద్యమం




సిటీబ్యూరో, మార్చి 22 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 15 రోజులకు నాంపల్లి గ్రౌండ్‌లో గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్‌తో సీఎం సమావేశం ఏర్పాటు చేసి డ్రైవర్లకు ప్రత్యేకంగా వాహన ఆధారిత యాప్ తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ ఏడాదిన్నర గడిచినా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. దీంతో డ్రైవరన్నలు రోడ్డెక్కారు. నిరసనలతో హోరెత్తిస్తున్నారు. 14 రోజులుగా జరుగుతున్న ఎయిర్‌పోర్ట్ రైడ్స్ బహిష్కరణ పోరాటం ఇప్పుడు మరో మలుపు తీసుకోనున్నది. సోమవారం నుంచి నగరంలో 'నో ఏసీ' నిరసన చేపడుతున్నారు. ఓలా, ఉబర్, ర్యాపిడోలు తమకు అన్యాయం చేస్తున్నాయని సర్కార్‌కు మొరపెట్టుకున్నా.. ఇప్పటికీ పట్టించుకోవడం లేదని డ్రైవర్లు వాపోయారు. మరోవైపు డ్రైవర్ల నిరసనతో శంషాబాద్ విమానాశ్రయ సిబ్బంది ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాహనాల కోసం క్యూలైన్లో గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తున్నది. దీని ప్రభావం జాతీయ, అంతర్జాతీయ ప్రయాణికులపై పడింది. గమ్యస్థానాలకు చేరుకోవడానికి ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

# బాధితురాలే బాధ్యురాలట..!

- కొత్తగడి గురుకుల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం ఘటనపై బీసీ కమిషన్‌కు నివేదికను అందించిన వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్
- సూసైడ్ అటెమ్ట్‌కు మానసిక స్థితే కారణమని వెల్లడి
- విచారణ కమిటీ సభ్యులు తోటి విద్యార్థినులు, టీచర్లను మాత్రమే అడిగి నివేదిక ఇవ్వడంపై బాలల హక్కుల సంఘం నేతల తీవ్ర ఆక్షేపణ

నివేదికపై విమర్శల వెల్లువ

వికారాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కొత్తగడి గురుకుల పాఠశాల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం ఘటన నివేదికపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫిబ్రవరి 24న కొత్తగడి గురుకుల పాఠశాలలో విద్యార్థిని పాఠశాల భవనం పై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన సంగతి తెలిసిందే. అయితే, ఈ ఘటనపై కలెక్టర్‌ను బీసీ కమిషన్ నివేదిక ఇవ్వాలని కోరగా.. స్పందించిన ఆయన ఓ విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ ఇచ్చిన నివేదికను కలెక్టర్ బీసీ కమిషన్‌కు అందజేయగా, శుక్రవారం వారు మీడియాకు విడుదల చేశారు. విద్యార్థిని తబిత ఆత్మహత్యాయత్నానికి మానసిక స్థితే కారణమని కలెక్టర్ ప్రతీక్ జైన్ బీసీ కమిషన్‌కు నివేదికను అందజేశారు. అంతేకాకుండా ఈ ఘటనకు పూర్తిగా విద్యార్థిని మాత్రమే కారణమని నివేదిక ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కాగా, విచారణ కమిటీ సభ్యులు బాధిత విద్యార్థినిని, ఆమె తల్లిదండ్రులతో మాట్లాడకుండానే.. ఎలా జరిగిందన్న విషయాన్ని పూర్తిగా తెలుసుకోకుండానే నివేదిక ఇచ్చినట్లు సమాచారం. వారు కేవలం తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులను మాత్రమే అడిగి కలెక్టర్‌కు నివేదికను అందించడంపై బాలల హక్కుల సంఘం నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఫిబ్రవరి 24న కొత్తగడి గురుకుల పాఠశాలలో విద్యార్థిని తబిత పాఠశాల భవనం పై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, పాఠశాల సిబ్బంది ఎవరికీ తెలియకుండా కాలు జారి కింద పడిందంటూ తల్లిదండ్రులకు చెప్పి ఇంటికి పంపించారు. ఇంటికెళ్లిన తర్వాత జరిగిన విషయాన్ని ఆమె తల్లిదండ్రులకు చెప్పడం, గురుకుల పాఠశాల ఎదుట విద్యార్థి సంఘాలతో కలిసి వారు ధర్నా చేయడంతో ఆలస్యంగా విషయం వెలుగులోకి వచ్చింది. కాగా, విద్యార్థిని తల్లిదండ్రులతో గతంలో జరిగిన గొడవను మనసులో పెట్టుకొన్న గురుకుల పాఠశాల ఉపాధ్యాయినులు విద్యార్థినిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని, విద్యార్థిని ప్రవర్తనపైనా వారు చేడు ప్రచారం చేయడంతోనే తట్టుకోలేక భవనం పై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని... విద్యార్థినితోపాటు తల్లిదండ్రులు స్పీకర్ ప్రసాద్ కుమార్, జిల్లా ఉన్నతాధికారులు, మీడియా ఎదుట గోడును వెల్లబోసుకున్నా.. వారి గోడును పట్టించుకోకుండా విచారణ కమిటీ సభ్యులు ఉపాధ్యాయినులకు అనుకూలంగా నివేదిక ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# చేతికొచ్చిన పంట వర్షార్పణం
# అకాల నష్టం..

- రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో వడగండ్ల వాన
- నేలరాలిన మామిడికాయలు, దెబ్బతిన్న పంటలు
- కూలిపోయిన ఇళ్లు, విరిగిపడిన విద్యుత్తు స్తంభాలు


షాబాద్ : కుమ్మరిగూడలో నేలరాలిన మామిడికాయలను చూపిస్తున్న రైతు పోనమోని కుమార్


మర్పల్లి : వానతో వంగిపోయిన జొన్న పంట

షాబాద్/మర్పల్లి/వికారాబాద్ : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. శుక్ర, శనివారాల్లో కురిసిన వానకు మామిడికాయలు నేలరాలాయి, పంటలు దెబ్బతిన్నాయి, విద్యుత్తు స్తంభాలు విరిగిపడ్డాయి. ఇంటిపై కప్పు రేకులు లేచిపోయాయి. శుక్రవారం రాత్రి రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలోని కుమ్మరిగూడ, లింగారెడ్డిగూడ, సాయిరెడ్డిగూడ, షాబాద్, ముద్దెంగూడ తదితర గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. ఈ వానతో కుమ్మరిగూడ గ్రామానికి చెందిన పోనమోని కుమార్ అనే రైతు తన ఎనిమిది ఎకరాల్లో సాగు చేసిన మామిడితోటలో మామిడికాయలు నేలరాలాయి. పూలతోటలు, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి.

అదేవిధంగా వికారాబాద్ జిల్లా, మర్పల్లి మండలంలోని కొంషెడ్‌పల్లి, మొగిలిగుండ్ల, బిల్‌కల్, దార్గులపల్లి తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం కురిసిన వడగండ్ల వానకు ఉల్లి, మొక్కజొన్న, మిరప పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన పంట వర్షార్పణం కావడంతో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ వానతో మండలంలో సుమారు 70 ఎకరాల వరకు పంట నష్టం జరిగినట్లు రైతన్నలు చెబుతున్నారు. కాగా, బిల్‌కల్‌కు చెందిన సురేశ్ అనే రైతు తనకున్న రెండెకరాలతోపాటు మరో రెండు ఎకరాలను కౌలుకు తీసుకుని ఉల్లి, జొన్న పంటలను సాగు చేశాడు. రెండు రోజుల్లో పంటను కొద్దామనుకునే సరికి వడగండ్ల వాన తనకు అపార నష్టాన్ని మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అప్పులు చేసి పంటలు సాగు చేస్తే తనకు అప్పులే మిగిలాయని.. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు. అదేవిధంగా మోమిన్‌పేట మండలంలోనూ వడగండ్ల వాన కురిసింది. ఈ వానతో మోమిన్‌పేట సంతలో కూరగాయలు విక్రయించుకునే రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూరగాయలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. కూరగాయల పంటలూ దెబ్బతిన్నాయి.


షాబాద్ : లింగారెడ్డిగూడలో ఈదురు గాలులకు లేచిపోయిన ఇంటి పై కప్పు రేకులు


మోమిన్‌పేట సంతలో వరద నీటిలో కొట్టుకుపోతున్న కూరగాయలు


షాబాద్ : లింగారెడ్డిగూడలో వర్షానికి దెబ్బతిన్న పూలతోట


తులీప్స్ గ్రాండ్ హోటల్ ఫుడ్ సేఫ్టీ అధికారులు గుర్తించిన కుళ్లిపోయిన మాంసం

# కుళ్లిన మాంసం.. గడువు తీరిన ఐస్‌క్రీమ్‌లు

తులిప్స్ గ్రాండ్ హోటల్‌లో గుర్తించిన ఫుడ్ సేఫ్టీ అధికారులు

తుర్కయాంజాల్, మార్చి 22 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు హోటళ్లలో ఇటీవల ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు బయటపడడంతో స్థానికులు హోటళ్లలో భోజనం చేయాలంటేనే జంకుతున్నారు. ముఖ్యంగా తుర్కయాంజాల్ చౌరస్తాలోని తులిప్స్ గ్రాండ్ హోటల్‌లో కుళ్లిపోయిన మాంసం 96 కిలోలు, గడువు తీరిన ఐస్‌క్రీమ్‌లు, పుట్ట గొడుగులను అధికారులు గుర్తించారు. అదేవిధంగా వంటగదిలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేదని.. వాడిన నూనెను మళ్లీ మళ్లీ వాడుతున్నట్లు కనిపెట్టారు.

# అర్ధరాత్రి చీకట్లు!

సిటీబ్యూరో : గ్రేటర్‌లో శుక్రవారం రాత్రి వీచిన గాలులు, కురిసిన వర్షానికి పలుచోట్ల విద్యుత్తు సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. సిటీ పరిధిలోని దాదాపు 340కి పైగా 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్తు నిలిచిపోయింది. ఇందులో ఎక్కువగా బంజారాహిల్స్‌లో 75, సైబర్‌సిటీలో 74, మేడ్చల్‌లో 64 ఫీడర్లు దెబ్బతిన్నాయి. అర్ధరాత్రి ఒక్కసారిగా కరెంట్ సరఫరా ఆగిపోవడంతో నగరవాసులు కాల్ సెంటర్లకు ఫోన్ చేశారు. పెద్దగా స్పందన లేకపోవడంతో వారు కరెంట్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 1920కి ఫోన్ చేసినా ఫలితంలేదని, సంస్థ ఇచ్చిన ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్లకు చేస్తే వాళ్లు స్విచ్ఛాఫ్ చేసుకున్నారంటూ ఉన్నతాధికారులకు చెప్పారు. చెట్లకొమ్మలు స్తంభాలపై పడడం, డిస్క్ ఇన్సులేటర్లు పగిలిపోవడంతో సరఫరా నిలిచిపోయింది. పాతబస్తీ, సైఫాబాద్, ఇందిరాపార్క్ ఏరియాల్లో ఉదయం వరకు సరఫరా నిలిచిపోవడంతో పలువురు వినియోగదారులు సిబ్బందికి ఫోన్లు చేశారు. కొన్నిచోట్ల కూలిన స్తంభాలను మార్చేందుకు శనివారం రాత్రి వరకు పట్టింది. రాత్రికి రాత్రే చాలాచోట్ల సరఫరాను విద్యుత్తు సిబ్బంది పునరుద్ధరించినట్లు అధికారులు చెప్పారు.


సుర్మయిగూడలోని పల్లెప్రకృతివనంలో ఎండిన మొక్కలు

# కానరాని పచ్చదనం

- మోడువారుతున్న పల్లెప్రకృతి వనాలు
- ప్రభుత్వ నిర్లక్ష్యం.. కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- సంరక్షణ కరువై ఎండిపోతున్న మొక్కలు

వివరాలు II లో..

'తెలంగాణ పచ్చబడాలే.. చెట్లు లేక బోసిపోయిన పల్లెలు, పట్టణాల్లో పచ్చదనం వెల్లివిరియాలే.. పర్యావరణ పరిరక్షణలో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలపాలే..' అని చెప్పిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, అదే సంకల్పంతో హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించి కోట్లాది మొక్కలకు ప్రాణం పోశారు. అదేవిధంగా స్థానికులకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేందుకు ప్రతి గ్రామంలోనూ పల్లెప్రకృతివనాలను ఏర్పాటు చేయించారు. అందులో పూలు, పండ్ల మొక్కలతోపాటు వివిధ రకాల ఔషధ గుణాలున్న మొక్కలను లక్షలాదిగా నాటించి.. వాటి సంరక్షణకు ప్రత్యేక నిధులను కేటాయించారు. వేసవిలోనూ ఆ మొక్కలు ఎండిపోకుండా ట్రీ గార్డులను ఏర్పాటు చేయించి నీటిని అందించేందుకు వనసంరక్షకులను నియమించారు. అయితే, 15 నెలల కాంగ్రెస్ పాలనలో పల్లెప్రకృతివనాలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో వాటి ఆలనాపాలనా కరువై ఏపుగా పెరిగిన మొక్కలు ఎండిపోతున్నాయి.

- న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ

# అన్నీ కోతలే..

వ్యవసాయం, పరిశ్రమలు, గృహాలకు నిరంతరం విద్యుత్తును సరఫరా చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ సర్కార్ అప్రకటిత కోతలతో అందరినీ ఇబ్బందులకు గురిచేస్తున్నది. ఆ కోతల ప్రభావం అన్నదాతలతోపాటు చిన్నతరహా పరిశ్రమలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నది. నాపరాతికి ప్రసిద్ధిగాంచిన తాండూరులోని వెయ్యికిపైగా ఉన్న పాలిషింగ్ యూనిట్లలో తయారయ్యే పలు ఉత్పత్తులకు కరెంట్ కోతలతో అంతరాయం ఏర్పడి.. వాటి యజమానులకు నష్టాలొస్తున్నాయి. అంతేకాకుండా ఆ యూనిట్లలో పనిచేసే దాదాపుగా 10,000 మందికి పైగా కార్మికుల ఉపాధికి గండి పడుతున్నది. కేసీఆర్ ప్రభుత్వంలో తాము 16 నుంచి 18 గంటలపాటు పాలిషింగ్ యూనిట్లు, నాపరాళ్ల క్వారీల్లో పని చేసి చేతినిండా డబ్బులు సంపాదించామని.. కానీ, ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతిరోజూ 8 నుంచి 10 గంటలే పనిచేస్తుండడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని పలువురు కార్మికులు పేర్కొంటున్నారు.

- వ్యవసాయం, పరిశ్రమలు, గృహాలకు నిరంతరం విద్యుత్తును సరఫరా చేస్తామని ప్రకటించిన సర్కార్
- అప్రకటిత కోతలతో చిన్నతరహా పరిశ్రమల ఉత్పత్తులకు అంతరాయం
- దాదాపుగా 10,000 మంది కార్మికుల ఉపాధికి గండి


కరెంటు కోతలతో తాండూరులో పని చేయని నాపరాతి పాలిషింగ్ యంత్రాలు

తాండూరు, మార్చి 22 : కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోతలతో అటు చిన్న తరహా పరిశ్రమలు, ఇటు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వాణిజ్య పరంగా ప్రముఖ వ్యాపార కేంద్రంగా కొనసాగుతున్న తాండూరు సెగ్మెంట్‌లో కనీసం 2 వేలకు పైగా చిన్న తరహా పరిశ్రమలపై దీని ప్రభావం తీవ్రంగా ఉన్నది. ఈ పరిశ్రమల్లో తయారయ్యే వివిధ ఉత్పత్తులకు కరెంటు కోతలతో అంతరాయం ఏర్పడడంతోపాటు యజమానులకు నష్టాలొస్తున్నాయి. బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్ విద్యుత్తు రంగంలో సంస్కరణలు తీసుకురావడంతో.. వ్యవసాయం మొదలుకొని అన్ని రంగాలకు 24 గంటల నిరంతర విద్యుత్తు సరఫరా కావడంతో వెలుగులు విరాజిల్లాయి. ఆసియా ఖండంలోనే నాపరాతికి ప్రసిద్ధిగాంచిన తాండూరు 24 గంటల విద్యుత్తుతో బాగా నడిచింది.. కాగా, నేడు కరెంట్ కోతలతో ప్రతిరోజూ కనీసం రూ.10 నుంచి రూ.15 లక్షలకు పైగా ఆదాయాన్ని పరిశ్రమల యజమానులు కోల్పోవాల్సి వస్తున్నది. తాండూరు పట్టణం, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటైన వెయ్యికి పైగా ఉన్న పాలిషింగ్ యూనిట్లలో పని చేస్తున్న 10 వేల మందికి పైగా కార్మికుల ఉపాధికి గండి పడుతున్నది. నాపరాళ్ల పాలిషింగ్ యూనిట్లలో చదరపు అడుగుల చొప్పున కమీషన్‌కు నాపరాళ్లను పాలిష్ చేసే కార్మికులకు కరెంటు కోతలతో నష్టాలు దాపురిస్తున్నాయి. పాలిషింగ్ పరిశ్రమలతోపాటు నియోజకవర్గంలోని రైస్ మిల్లులు, దాల్‌మిల్లులు, సుద్ద పరిశ్రమలపైనా ఈ కోతల ప్రభావం పడుతున్నది. చిన్న పరిశ్రమల ఉత్పత్తులు స్తంభించి ప్రతిరోజూ కనీసం రూ.10 లక్షల వరకు ఆదాయం కోల్పోతున్నట్లు సమాచారం.


అప్రకటిత కరెంట్ కోతతో పాడైన బోరు మోటరుకు మరమ్మతులు చేస్తున్న రైతులు

## అన్నదాతకు అవస్థలు..

అప్రకటిత విద్యుత్తు కోతలు అన్నదాతకు శాపంగా మారుతున్నాయి. బోర్లపై ఆధారపడి పంటలు సాగు చేసిన రైతన్నకు తీరని నష్టాన్ని మిగుల్చుతున్నాయి. ఒకవైపు భూగర్భజలాలు అడుగంటుతుండడంతో నీళ్లు లేక కండ్ల ముందే ఎండిపోతున్న పంటలను చూసి అన్నదాత కన్నీళ్లు పెట్టుకుంటున్నాడు. మరోవైపు రోజుకు 3-4 గంటలు మధ్యమధ్యలో కరెంట్ వస్తూపోతుండడంతో బోరుబావుల్లోని మోటర్లు పాడవుతున్నాయి. లోవోల్టేజీ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లూ కాలిపోతున్నాయి. ఎప్పుడు పోతుందో.. ఎప్పుడు వస్తుందో తెలియని కరెంటుతో అన్నదాతలు రాత్రి సమయాల్లోనూ పొలాల దగ్గరే ఉండాల్సిన దుస్థితి దాపరించింది. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వరి చేనుకు నీళ్లు అందక పంటలు ఎండిపోతున్నాయి.

## కరెంట్ కోతలతో ఇబ్బందులు..



నా స్వస్థలం కర్ణాటక రాష్ట్రం. బతుకుదెరువు కోసం తాండూరుకు వచ్చా. బీఆర్‌ఎస్ పాలనలో నాపరాళ్ల పరిశ్రమలకు 24 గంటలపాటు కరెంట్ సరఫరా కావడంతో 16 నుంచి 18 గంటలపాటు పాలిషింగ్ యూనిట్లు, నాపరాళ్ల క్వారీల్లో పని చేసి చేతినిండా డబ్బులు సంపాదించా. ఒక్కో పాలిషింగ్ యూనిట్ లో సగటున 4 యంత్రాలకు వెయ్యి నుంచి 12 వందల చదరపు అడుగుల నాపరాళ్లు పాలిషింగ్ చేసి తనతోపాటు చాలామంది దినసరి కూలీగా అధిక మొత్తంలో తీసుకున్నాం. కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోతలు ప్రారంభం కావడంతో చాలా ఇబ్బందిగా మారింది. ప్రతిరోజూ 8 నుంచి 10 గంటలే పనిచేస్తుండడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. కరెంటు కోతల్లేకుంటే ప్రతిరోజూ 16 నుంచి 18 గంటలు పని చేసి రూ.800 నుంచి రూ.1200 సంపాదించేది.

-అక్షయ్, కార్మికుడు

## బీఆర్‌ఎస్ హయాంలోనే ఫుల్ కరెంటు



పదేండ్ల బీఆర్‌ఎస్ హయాంలో కరెంట్ ఫుల్లుగా ఉన్నది. 2014 తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కంటే ముందు కరెంట్ కోసం ఎంత తిప్పలైందో ఇప్పుడు మళ్లీ అదే బాధ. రాత్రిళ్లు మోటర్ల వద్దే నిద్రించాల్సిన రోజులొచ్చాయి. ప్రస్తుతం రోజుకు 3-4 గంటలపాటు కరెంటు పోతుండడంతో ఇబ్బందులు తప్పడంలేదు. పంట పొలాలకు సరిగా నీళ్లు అందక చేతికొచ్చిన పంటలు ఎండిపోతున్నాయి. గ్రామాల్లో రాత్రివేళ్లలోనూ కరెంట్ కోతలు ఉంటుండడంతో అందరూ ఇబ్బంది పడుతున్నారు. బీఆర్‌ఎస్ పాలన వస్తేనే రైతులకు బాగుంటుంది. పండుగల వ్యవసాయం చేసుకుంటాం. సంతోషంగా జీవిస్తాం.

-నర్సప్ప, రైతు, జుంటుపల్లి